క్లుప్తంగా

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం



సన్నవిల్లిలో సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ జంగమయ్య

ఉప్పలగుప్తం: ఉపాధ్యాయుడిగా నిమ్మకాయల సత్యనారాయణ అందించిన సేవలు చిరస్మరణీయమని సర్పంచ్ చిక్కం జంగమయ్య వ్యాఖ్యానించారు. ఇటీవలే మరణించిన విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల సత్యనారాయణ సంతాప సభను గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఏర్పాటుచేశారు. సర్పంచ్ జంగమయ్య హాజరై సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, నిమ్మకాయల మహీపతిరావు, సద్గుణరావు, లక్ష్మణరావు, వీరాస్వామినాయుడు, తొత్తరమూడి బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఈవోపై ధర్మకర్తల మండలి ఫిర్యాదు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీచెన్న మల్లేశ్వర స్వామి ఆలయ ఈవో సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ధర్మకర్తల మండలి సమావేశాలు నిర్వహించడం లేదని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కల్వకొలను బాబి, ధర్మకర్తలు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌లకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దాదాపు ఆరు నెలలుగా ఆలయానికి రాకుండా ఆలయ ఆదాయ వ్యయాలపై సమీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈవోను ఇక్కడ నుంచి బదిలీ చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

15న రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి పోలీస్‌శాఖలో ఖాళీగా ఉన్న థియేటర్ అటెండెంట్ పోస్టుకు ఈనెల 15న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రాతపరీక్ష నిర్వహించనున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ డ్రైవర్ గ్రేడ్-3 పోస్టులకు రాతపరీక్ష పుదుచ్చేరిలోని భారతీదాసన్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 0413-2233338 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సమస్యలపై ఆర్‌ఏఓకు వినతి



ఆర్‌ఏఓ మునిస్వామితో సమస్యలపై చర్చిస్తున్న అధ్యాపకులు

యానాం: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం ఆర్‌ఏఓ మునిస్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. 7వ వేతన సంఘ సిఫార్సుల బకాయిల చెల్లింపు, హెచ్‌ఆర్‌ఏ, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను అర్హులైన అధ్యాపకులకు అమలు చేయాలన్నారు. 2018లో పీహెచ్‌డీ అర్హతతో నియమితులైన అధ్యాపకులకు ఇంక్రిమెంట్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని కలిసిన అశోక్



లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆశోక్‌ని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కుడుపూడి అశోక్ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను గోడిలోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సందర్భంగా ఆశోక్‌ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ

ఉప్పలగుప్తం: ఇటీవల మృతి చెందిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షుడు యేర్నేని నాగేంద్ర ప్రసాద్‌ల సంస్మరణ సభ మండలంలోని గొల్లవిల్లి భీమేశ్వర ఆడిటోరియంలో నిర్వహించారు. కోనసీమ రైతు పరిరక్షణ సంఘం అధ్యక్షుడు యాళ్ల బ్రహ్మానందం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు చిక్కం బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వలకట్లే అడ్డుకట్టలు

- ఎన్.రామేశ్వరం మొగ పూడికతీత పనులతో ముంపు నుంచి ఉపశమనం
- 35 వేల ఎకరాల ఆయకట్టుకు మేలు
- వలకట్లపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్న అన్నదాతలు



ప్రధాన డ్రెయిన్‌లో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ ఏర్పాటుచేసిన వలకట్టు

అల్లవరం: సముద్రపు మొగలో ఏటా ఇసుక మేటల కారణంగా ముంపు నీరు దిగక వేలాది ఎకరాల్లో సాగుకు అవరోధమేర్పడుతోంది. ఇటీవలే ఎన్.రామేశ్వరం మొగలో పూడికతీత పనులు చేపట్టడంతో మొగ తెరుచుకుని ముంపు నీరు వడివడిగా సముద్రంలోకి చేరుతుంది. దీనివల్ల 35 వేల ఎకరాల ఆయకట్టుకు మేలు కలుగుతుంది. అయితే మొగ మూసుకుపోవడానికి కారణమవుతున్న వలకట్లపైనా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అమలాపురం నియోజకవర్గం పరిధిలోని అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లోని ప్రధాన డ్రెయిన్లు వాసాలతిప్ప, లోయర్ కౌశిక, పంచనీటి మీడియం డ్రెయిన్‌ల్లోకి వచ్చి చేరుతున్న ముంపు నీరు ఎన్.రామేశ్వరం మొగ ద్వారానే సముద్రంలోకి దిగాల్సి ఉంటుంది. ఏటా జనవరి నుంచి జూన్ వరకూ ప్రధాన డ్రెయిన్లలో నీటి ప్రవాహం లేక మొగ ప్రాంతంలో భారీగా ఇసుక మేటలు వేస్తోంది. దీంతో మొగ పూడుకుపోయి ముంపునీరు దిగే దారి లేక పొలాలను ముంచేస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే మొగ ఇసుకమేటలతో నిండిపోయింది.

అయితే వర్షపాతం తక్కువగా ఉండడంతో ముంపు ప్రభావం తలెత్తలేదు. అయితే భారీవర్షాలు పడితే మాత్రం ముంపునీరు దిగక సుమారు 35,000 ఎకరాలకు ముంపు ముప్పు తప్పదని రైతులు ఆందోళన చెందారు. దీంతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పందించి రూ.20 లక్షల సీఎస్ఆర్ నిధులు విడుదల చేసి ఎన్.రామేశ్వరం మొగ వద్ద పూడికతీత పనులు చేపట్టడంతో ముంపునీరు సముద్రంలోకి చేరుతోంది. అయితే ఇంతవరకూ బాగానే ఉన్నా ప్రధాన డ్రెయిన్లలో ఇష్టారాజ్యంగా వేసిన వలకట్లను తొలగించకపోతే మొగ మళ్లీ మూసుకుపోవడం ఖాయమని జల వనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఎన్.రామేశ్వరం మొగలో పూడికతీత తర్వాత సముద్రానికి చేరుతున్న ముంపు నీరు

> **వలకట్లు వేయడం చట్టరీత్యా నేరం**
>
> ప్రధాన డ్రెయిన్‌లో నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వలకట్లు వేయడం చట్ట రీత్యా నేరం. కొంతమంది మొండిగా వ్యవహరించి వలకట్లు వేస్తున్నారు. అలా వేసినవారికి నోటీసులిచ్చి పోలీసుల ఆధ్వర్యంలో వలకట్లు తొలగించినా రాత్రికి రాత్రే మళ్లీ వేసేస్తున్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.
>
> – సునీతాదేవి, డ్రెయిన్ ఏఈ, అమలాపురం

వలకట్లులే ప్రధాన అడ్డంకులు

అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ఏటా ముంపు ఏర్పడడానికి ప్రధాన కారణం వలకట్లేనన్నది అందరికీ తెలిసిందే. మత్స్య సంపద కోసం గెడ బొంగులతో తయారుచేసిన వలకట్లు ప్రధాన డ్రెయిన్లలో ఏర్పాటుచేస్తున్నారు. వలకట్లకి పరదాలు అడ్డు పెట్టడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి ఇసుక మేటలకు ఆస్కారమేర్పడుతుంది. ఇలా ఒకటో రెండో అయితే పర్లేదు. లోయర్ కౌశిక, పంచనీటి మీడియం డ్రెయిన్, వాసాలతిప్ప డ్రెయిన్లలో ప్రధానంగా ఆరు చోట్ల వలకట్లు ఏర్పాటు చేశారు. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ముంపు నీరు సముద్రానికి చేరకుండా వలకట్లు అడ్డుగా ఉండడంతో మేజర్, మైనర్ డ్రెయిన్ల నుంచి వరి పొలాల్లోకి నీరు చేరి ముంపు ఏర్పడుతుంది. ఏటా లక్షలు ఖర్చు చేసి మొగల్లో పూడికతీత పనులు చేస్తున్నారే తప్ప నీటి ప్రవాహాన్ని అడ్డుకునే వలకట్లు తొలగించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ముంపు నీరు సహజసిద్ధంగా సముద్రానికి చేరాలంటే ప్రధాన డ్రెయిన్లలో ఏర్పాటు చేసిన వలకట్లు తొలగించి నీటి వేగాన్ని పెంచాలని రైతులు కోరుతున్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడుల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 10వ తేదీ వరకూ గడువు పొడిగించామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

చినవలసలలో గ్రామసభ



చినవలసల గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ గోవలక్ష్మి

తాళ్లరేవు: మండలంలోని చినవలసల పంచాయతీ కార్యాలయం వద్ద గాడిమొగ సర్పంచ్ గోవలక్ష్మి అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. గ్రామసభలో పలువురు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు. తాళ్లరేవులో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

అల్లవరం: కుల, వర్గ, మత బేధం లేకుండా ప్రభుత్వం అందరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు స్పెషలిస్ట్ వైద్యులతో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తుందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్‌లు పాల్గొని రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ ఎస్.మౌనిక, కొనుకు బాపూజీ, తిక్కా ప్రసాద్ పాల్గొన్నారు.

తాళ్లరేవు: రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. బుధవారం ఉప్పంగల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు టొమ్మేటి శామ్యూల్ సాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిబిరంలో వైద్య బృందం సుమారు 250 మంది రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శాఖ శంకురుడు, లచ్చిపాలెం సొసైటీ అధ్యక్షుడు దవులూరి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కాదా శ్రీనివాస్, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పంగలలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివన్నారాయణ

ఉప్పలగుప్తం: ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు భరోసా కల్పిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని చల్లపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో ముందుగా నిర్వహించిన సర్వే ఆధారంగా వైద్యాధికారులు 305 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఇసుకపట్ల రఘుబాబు, ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, ఈవోపీఆర్‌డీ కేవీఎస్ గౌరీకుమారి, వైద్యులు ఢిల్లీ ప్రసాద్, లోవ సుధ, మనోహర్ పాల్గొన్నారు.



చల్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంపదరావు

కాట్రేనికోన: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతుందని ఎంపీడీఓ వెంకటాచలం అన్నారు. కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో ఆయన అధ్యక్షతన బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. శిబిరంలో సుమారు 250 మందికి వైద్య సేవలు అందించారు.

అమలాపురం రూరల్: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌వో భారతలక్ష్మి అన్నారు. బుధవారం ఇందుపల్లి సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో 513 మందికి వైద్య సేవలందిచారు.

జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం



ముమ్మిడివరం నగర పంచాయతీలో గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం, రాజుపాలెం, మట్టాడిపాలెంల్లో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ మంచి చేస్తున్న సీఎం జగనన్నను రానున్న ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి, వాసంశెట్టి ఫణి, దొమ్మేటి అప్పారావు, రెడ్డి శివన్నారాయణ, యలమంచిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

- మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్
- కొమరగిరిపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు ఆర్థిక భరోసాని పొందుతున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. కొమరగిరిపట్నంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. చేతివృత్తిదారులు, రైతులు, విద్యార్థులు, మహిళలకు వివిధ రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంద శాతం అమలుచేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని శ్రీకాంత్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మండల నోడల్ అధికారి కృష్ణమోహన్, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్‌రాజు, యూత్ అధ్యక్షుడు బళ్ల శ్యామ్, నిమ్మకాయల శేఖర్, బొంతు సత్యనారాయణ, జాన్‌తాతారావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తున్న పినిపే శ్రీకాంత్

పార్కుకు పరికరాల వితరణ

అమలాపురం టౌన్: స్థానిక రెండో వార్డులోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనానికి (పార్కు) కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ, మాజీ కౌన్సిలర్ ఆదిబాబు దంపతులు రూ.30 వేల విలువైన పలు పరికరాలను సమకూర్చారు. గ్రాస్ కట్టర్, మొక్కలకు పురుగుల మందులు, ఎలక్ట్రికల్ గూడ్స్ అందించారు. వీటిని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులకు బుధవారం పార్కులో అందజేశారు. పార్కు అభివృద్ధికి కృషి చేస్తున్న కౌన్సిలర్ ఆశెట్టి దంపతులను చైర్‌పర్సన్, కమిషనర్‌లు సత్కరించారు. కార్యక్రమంలో ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, బులియన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతలపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణికి పార్కు పరికరాలను అందజేస్తున్న కౌన్సిలర్ దంపతులు

దీపావళి దుస్తుల కోసం పత్రాలివ్వండి

యానాం: యానాం ఆదిద్రావిడ సంక్షేమ, షెడ్యూల్డ్ ట్రైబ్ శాఖ ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇచ్చే ఉచిత దుస్తుల కోసం లబ్ధిదారులు సంబంధిత పత్రాల జిరాక్స్‌లను సమర్పించాలని ఏడీ రేకాడి కృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, నూతనంగా వివాహం జరిగినవారు ఉచిత దుస్తుల కోసం తమ బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను యానాం ఆదిద్రావిడ శాఖకు ఈ నెల 6లోగా అందించాలని కోరారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు రాట ముహూర్తం



వెంకన్న బ్రహ్మోత్సవాల రాటముహుర్తం చేస్తున్న భక్తులు

యానాం: ఈ నెల 15 నుంచి 24 వరకూ యానాంలో జరగనున్న శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి 21వ బ్రహ్మోత్సవాలకు సంబంధించి రాట ముహూర్తం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు యావన్మంది పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవదారులతో పాటు అర్చకులు నరసింహాచార్యులు, అనంతాచార్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయం వద్ద ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరించారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా సంఘంలోని సభ్యులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, సభ్యులు కుడుపూడి నాగేశ్వరరావు, కుసుమే నరసింహరాజు, కాగిత సోమరాజు, గిడ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న జిల్లా చేతి వృత్తుల సంఘం ప్రతినిధులు

పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం గ్రామంలో ఉన్న ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి కె.కమలాకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీపీ పాఠశాలలో 1, 2 తరగతుల విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు చేరుతున్న తీరును పరిశీలించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజన విధానంపై ఆరా తీశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సత్యనారాయణ, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, సీఆర్ఎంటీ కె.సత్తిబాబు తదితరులు డీఈవో వెంట ఉన్నారు.



గోపవరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి కె.కమలాకుమారి

ఆలోచింపజేసిన మాక్‌డ్రిల్

యానాం: సునామీ వస్తే తీసుకోవాల్సిన చర్యలను తెలుపుతూ ఫ్రీఐడబ్ల్యూ వేవ్-23 పేరిట రెవెన్యూ, పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సునామీ మాక్ ఎక్సర్‌సైజ్ అందరినీ ఆలోచింపజేసింది. స్థానిక ఓల్డ్ రాజీవ్‌నగర్ టైడల్‌లాక్ వద్ద నిర్వహించిన ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో రెవెన్యూ, పోలీస్, పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్, మున్సిపాలిటీ, ఫైర్ సర్వీసు, హెల్త్, ఫిషరీస్, ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్, ఈఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌ఏఓ మునిస్వామి సారథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా మాక్‌డ్రిల్ నిర్వహించారు. రిలీఫ్ క్యాంప్, మెడికల్ ఎయిడ్ సెంటర్, కంట్రోల్ రూమ్‌లు, బాధిత పునరావాస కేంద్రాలను కల్పితంగా ఏర్పాటు చేశారు.




మాక్‌డ్రిల్‌లో బాధితులకు మైకు ద్వారా జాగ్రత్తలను తెలియజేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

'వనమాల' చిత్రానికి అవార్డు



సిల్వర్ అవార్డుకు ఎంపికైన వనమాల చిత్రం



చిత్రకారుడు కేశవవర్మ

యానాం: హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్ర కళా అకాడమీ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో రామాయణం అనే అంశంపై యానాం పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కేశవ వర్మ గీసిన 'వనమాల' చిత్రానికి సిల్వర్ అవార్డు లభించింది. ఈ మేరకు సంస్థ ఫౌండర్ కాసుల పద్మావతి నుంచి బుధవారం తనకు లేఖ అందిందని కేశవవర్మ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కేశవవర్మ చిత్ర కళా ప్రతిభను అభినందించారు.

90 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు: కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారి 216లోని సుబ్బారాయుని దిమ్మ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా స్విఫ్ట్ కారులో 90 మద్యం సీసాలను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఘటనలో రౌతులపూడి మండలం ఉప్పంపాలెం గ్రామానికి చెందిన బచ్చ తాతాజీ, కోరుప్రోలు దుర్గరాజులను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేసినట్లు తెలిపారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తాళ్లరేవు: అక్రమ మద్యాన్ని తరలిస్తున్న ఆటోను కోరంగి పంచాయతీ సీతారామపురం వద్ద మంగళవారం రాత్రి సీజ్ చేసినట్లు తాళ్లరేవు ఎస్ఈబీ సీఐ జేవీ భవానీ తెలిపారు. ఆకస్మిక దాడులు నిర్వహించి యానాం మెట్టకుర్రు గ్రామానికి చెందిన పత్తి నాగరాజు, దరియాలతిప్పకు చెందిన నందికోళ్ల సాయిబాబు ఆటోలో మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా ఈ వ్యాపారానికి సహకరిస్తున్న మరో ఇద్దరు తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మల్లాడి దుర్గాప్రసాద్, యానాం మెట్టకుర్రు గ్రామానికి చెందిన దేవు రుద్రను అరెస్ట్ చేయవలసి ఉందన్నారు. నలుగురుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆటోలో తరలిస్తున్న 986 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశామన్నారు.



తనిఖీల్లో పట్టుబడ్డ అక్రమ మద్యం, నిందితులతో కోరంగి పోలీసులు

కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలకు రెండోసారి ప్రతిష్టాత్మకమైన నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించిందని బీవీసీ సంస్థల అధినేత బోనం కనకయ్య బుధవారం తెలిపారు. ఇప్పటికే నాక్ గ్రేడ్-ఎ అటానమస్ సాధించిన కళాశాల తాజాగా ఎన్‌బీఏ సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బోనం కృష్ణ సతీష్, ప్రిన్సిపాల్ రామారావు, ఏవో జక్కం కృష్ణారావు పాల్గొన్నారు.



కళాశాలలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న బీవీసీ సంస్థల అధినేత బోనం కనకయ్య

ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అధ్యక్షుడిగా కట్టా

అమలాపురం రూరల్: అమలాపురం ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కట్టా వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈదరపల్లి లక్ష్మీనరసింహస్వామి నగర్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం జరిగాయి. సంఘం ప్రధాన కార్యదర్శిగా కాళ్ళ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా చాగంటి బాబులు, జాయింట్ సెక్రటరీగా వంగలపూడి శివకుమార్, ట్రెజరర్‌గా సింగవరపు సత్యనారాయణ, జాయింట్ ట్రెజరర్‌గా బళ్ల శ్రీధర్‌రావు, సలహా కమిటీ సభ్యులుగా బత్తుల జనార్దనరావు, గాలి దేవర వెంకటరమణలను ఎన్నుకున్నారు.